


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, శనివారం 24 ఆగస్టు 2024 | HYDERABAD


## వర్ష సూచన



సిటీబ్యూరో, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఆవర్తనం ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిశాయి. శుక్రవారం రాత్రి 9.30గంటల వరకు నగరంలోని జూబ్లీహిల్స్‌లో అత్యధికంగా 1.10సెం.మీలు, యూసుఫ్‌గూడలో 1.0సెం.మీలు, ఖాజాగూడ, వెంగల్‌రావునగర్‌లో 5.5 మి.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 31.0, కనిష్ఠం 23.8డిగ్రీలు, గాలిలో తేమ 74 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఆవర్తనం ప్రభావంతో రాగల మరో రెండురోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

## హాస్టళ్లలో తనిఖీలు

సిటీబ్యూరో, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలో శుక్రవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు పలు ప్రాంతాల్లోని కళాశాలలు, హాస్టళ్లలో వంటగది, సామగ్రి, స్టోరేజ్ ఏరియా, తయారు చేసిన ఫుడ్ ఐటమ్స్, రా మెటీరియల్‌తో పాటు పారిశుధ్య నిర్వహణ వంటవి పరిశీలించారు. ఈ నెల 21 నుంచి శుక్రవారం వరకు మొత్తం 28 ప్రైవేట్, ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టళ్లను తనిఖీ చేశారు. ఎల్బీనగర్ జోన్‌లో నాలుగు రెసిడెన్షియల్ హాస్టళ్లు, చార్మినార్‌లో 6, ఖైరతాబాద్‌లో 5, శేరిలింగంపల్లిలో 5, కూకట్‌పల్లిలో 4, సికింద్రాబాద్ జోన్‌లో 4 ప్రైవేట్, ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టళ్లను తనిఖీ చేశామని, నిబంధనలు ఉల్లంఘించిన వాటిపై చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు

## నకిలీ ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు

సిటీబ్యూరో: మల్కాజిగిరి సర్కిల్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేరుతో డ్రగ్ మార్ట్ వ్యాపారాన్ని తెరిచేందుకు ఒక లైసెన్స్, మరొకటి 'డ్రగ్స్ మార్ట్ ఇన్ కాంగ్రెస్' పేరుతో మరొకటి కలిపి రెండు ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో జీహెచ్ఎంసీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఈ రెండింటికీ టిన్ నంబర్లను బ్లాక్ చేస్తున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఈ ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేసిన సంబంధిత అధికారులపై చర్యలు మాత్రం తీసుకోకపోవడం గమనార్హం.

## 'సీజనల్' నివారిద్దాం

సిటీబ్యూరో: సీజనల్ వ్యాధుల నివారణ కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సమన్వయంతో ముందుకెళ్లాలని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అడిషనల్, జోనల్ కమిషనర్లతో ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శానిటేషన్ నిర్వహణలో భాగంగా రాంకీ వాహనాలు సకాలంలో వచ్చి చెత్తను తీసుకుపోయే విధంగా జీఐఎస్ సిస్టం ద్వారా పరిశీలన చేయాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు.

### 25 మందికి స్థానచలనం

జీహెచ్ఎంసీలో పలువురు ఉన్నతాధికారులకు స్థాన చలనం, ఇతర శాఖల నుంచి వచ్చిన అధికారులకు పోస్టింగులు ఖరారు చేస్తూ కమిషనర్ ఆమ్రపాలి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లతో కలిపి 25 మందిని బదిలీ చేశారు. ఇతర శాఖల నుంచి వచ్చిన డిప్యూటీ కమిషనర్లకు 23 రోజుల తరువాత పోస్టింగులు ఇవ్వడం గమనార్హం.






# రోజులో 40 సార్లు

## విద్యుత్ అంతరాయం.. ఫొటోలతో సహా అధికారుల ట్వీట్లు

*కాంగ్రెస్ పాలనలో విద్యుత్ అంతరాయాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. కరెంటు పోవడం.. కొద్దిసేపటి తర్వాత రావడం..సాధారణమైపోతున్నది. ఇదిలా ఉంటే శుక్రవారం గ్రేటర్‌లో 24 గంటల్లో ఏకంగా 40సార్లకుపైగా సరఫరాకు అంతరాయం కలిగింది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ.. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) నిర్వహించే ఎక్స్ (ట్విట్టర్) వేదికగా సంబంధిత సర్కిల్ అధికారులు ఫొటోలతో సహా పోస్టులు సైతం పెట్టడం గమనార్హం. కావాల్సినంత విద్యుత్ అందుబాటులో ఉన్నా.. సర్కారు పర్యవేక్షణ లేకపోవడం.. దీనికితోడు నెట్‌వర్క్‌ల నిర్వహణలో కాంట్రాక్టర్లు చేస్తున్న మొక్కుబడి పనులతో నిత్యం సమస్యలు ఎదురవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు.*

-సిటీబ్యూరో



### • నిర్వహణ.. మరమ్మతులే కీలకం..


నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలంటే నెట్‌వర్క్‌లో నిర్వహణ, మరమ్మతులు అత్యంత కీలకం. ఇప్పటికే వినియోగంలో ఉన్న నెట్‌వర్క్ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లను ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. అయితే కాంట్రాక్టర్లు చేస్తున్న పనులపై సరిగా దృష్టి సారించడం లేదనే ఆరోపణలున్నాయి. డిపార్టుమెంట్‌కు సంబంధించిన పనులను కాంట్రాక్టర్లు మొక్కుబడిగా చేయడం వల్లే తరచూ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఉండి లైన్లను పర్యవేక్షించాలని ఉన్నతాధికారులు ఆదేశించినా.. కింది స్థాయి అధికారులు మాత్రం కాంట్రాక్టర్లతో కుమ్మక్కై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

**గ్రేటర్** హైదరాబాద్ పరిధిలోని 10 సర్కిల్ కార్యాలయాలైన హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్, సికింద్రాబాద్, బంజారాహిల్స్, సైబర్ సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, హబ్సిగూడ, మేడ్చల్, సంగారెడ్డిల పరిధిలో విద్యుత్ వినియోగదారులు కరెంటు సరఫరాలో నిత్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి. కరెంటు పోవడం.. కొంతసేపటి తర్వాత రావడం అనేది సర్వసాధారణంగా మారిందని, తరచూ ఫోన్లు చేసి విరక్తి వస్తోందంటూ వినియోగదారులు వాపోతున్నారు. విద్యుత్ నెట్‌వర్క్ నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా ఉండటం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోందని కింది స్థాయి సిబ్బంది పేర్కొంటున్నారు.

**నెట్‌వర్క్ నిర్వహణ.. నిర్లక్ష్యం వల్లే తరచూ సరఫరాలో సమస్యలు**

### మొక్కుబడిగా పనులు: విద్యుత్ ఉద్యోగి


డిపార్టుమెంట్‌కు సంబంధించిన పనులు చేసే కాంట్రాక్టర్లు సరిగా చేయకపోవడం వల్లే తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. వినియోగదారుడు ఫిర్యాదు చేసిన వెంటనే (ఫ్యూజ్ ఆఫ్ కాల్) సిబ్బంది అక్కడికి వెళ్లి సరిచేసి సరఫరాను పునరుద్ధరించాల్సి వస్తోంది. కాంట్రాక్టర్లు సరిగా పనులు చేయరు. నిర్వహణ, మరమ్మతు పనులు చేసినట్లు బిల్లులు మాత్రం తీసుకుంటారు. దీని వల్లే క్షేత్ర స్థాయిలో నెట్‌వర్క్‌లో ప్రతి రోజూ విద్యుత్ సరఫరాల్లో అంతరాయాలు కలుగుతున్నాయి. ఈ విషయాన్ని మేము సర్కిల్ పరిధిలోని ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈ స్థాయి అధికారులకు చెప్పినా.. వారు కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సరఫరా నిలిచిపోయిన వెంటనే మేము అక్కడి వెళ్లి పునరుద్ధరణ చేయకపోతే మమ్మల్నీ బాధ్యులను చేస్తున్నారు. డిపార్టుమెంట్ పనులు చేసే కాంట్రాక్టర్లపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ లేకపోతే ఇలాంటి సమస్యలు మళ్లీ మళ్లీ వస్తూనే ఉంటాయి.



**గ్రేటర్‌లో 24 గంటల్లో 40సార్లకుపైగా అంతరాయం**

**శుక్రవారం ఎక్స్ వేదికగా పోస్టు చేసిన సర్కిల్ అధికారులు(కొన్ని మాత్రమే)**

- సరూర్‌నగర్ సర్కిల్‌లోని 11కేవీ విద్యుత్ నగర్ ఫీడర్ కింద హెచ్‌జీ ఫ్యూజ్‌లో సమస్య(సరఫరాలో అంతరాయం -సాయంత్రం 5.00)
- హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లోని 11కేవీ బాపునగర్ ఫీడర్ కింద హెచ్‌జీ ఫ్యూజ్‌లో సమస్య (సాయంత్రం 5.03)
- సికింద్రాబాద్ ఆపరేషన్స్ సర్కిల్ పరిధిలోని 11 కేవీ (బాలానగర్‌లోని ప్రశాంత్‌నగర్) ఫీడర్ కింద వచ్చే రాజీవ్‌గాంధీ నగర్‌లో 160 కేవీవీ డీటీఆర్ దగ్గర స్పార్క్‌లు వచ్చి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. (సాయంత్రం 4.29 సమయంలో ట్విట్టర్‌లో పోస్టు చేసిన సర్కిల్ అధికారులు)
- హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలోని 11కేవీ మెహఫిల్ హోటల్ ఫీడర్ పరిధిలో ఏబీ స్విచ్‌లో స్పార్క్ రావడంతో సరిచేశారు. (విద్యుత్ సరఫరా నిలిచిన సమయం సాయంత్రం 4.22)
- సైబర్ సిటీ ఆపరేషన్స్ సర్కిల్ పరిధిలోని 11కేవీ టీఎన్‌జీవో కాలనీ ఫీడర్‌లో హెచ్‌జీ ఫ్యూజ్‌లో సాంకేతిక సమస్యలతో అంతరాయం (సాయంత్రం 4.17)
- హబ్సిగూడ సర్కిల్ పరిధిలోని 11కేవీ శ్రీకృష్ణ ఫార్మసీ ఫీడర్ కింద ఏబీ స్విచ్‌తో స్పార్క్‌లతో విద్యుత్ సరఫరాలో అంతరాయం (సాయంత్రం 3.59)
- బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని 11కేవీ ఈఎస్ఐ స్టాఫ్ క్వార్టర్స్ ఫీడర్‌లో ఏబీ కేబుల్‌లో మంటలు వచ్చాయి. (విద్యుత్ సరఫరాలో అంతరాయం సాయంత్రం 4.04)
- హైదరాబాద్ సర్కిల్ 11 కేవీ చాచా నెహ్రూ పార్కు ఫీడర్‌లోని ఏబీ స్విచ్‌లో లోపంతో (విద్యుత్ అంతరాయం.. సాయంత్రం 3.47).
- పంచవటి కాలనీ ఫీడర్‌లో ఏబీ స్విచ్ సమస్యతో అంతరాయం. (మధ్యాహ్నం:3.50)
- సైబర్ సిటీ సర్కిల్‌లోని గోల్డెన్ తులిప్ ఫీడర్‌లోని జంపర్ రీ బైండింగ్‌తో అంతరాయం. (మధ్యాహ్నం 3.51)
- సంతోషిమాత ఫీడర్ పరిధిలో హెచ్‌జీ ఫ్యూజ్ మార్చివేయాల్సిన కారణంగా అంతరాయం. (మధ్యాహ్నం 2.11)



# 1200 ఆస్తుల సేకరణ

## 7.5 కి.మీతో పాతనగరం మెట్రో

భూసేకరణ వేగవంతం..8 నెలల్లో ప్రక్రియ పూర్తికావొచ్చు

400 ఆస్తుల సేకరణకు నోటిఫికేషన్లు జారీ

మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి



సిటీబ్యూరో, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): పాతనగరంలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మిస్తున్న మెట్రో మార్గం కోసం భూసేకరణ వేగంగా జరుగుతోందని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎంజీబీఎస్ వరకు ఉన్న మార్గాన్ని పాతనగరం మీదుగా చాంద్రాయణగుట్ట వరకు సుమారు 7.5 కి.మీ మేర నిర్మిస్తున్నామని, ఇందు కోసం సుమారు 1200 ఆస్తులను సేకరించాల్సి ఉంటుందని చెప్పారు. భూసేకరణ చట్టం-2013 కింద 400 ఆస్తులకు సంబంధించిన భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు. వివిధ పత్రికల్లోనూ ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లు ఇచ్చి ఆస్తులను సేకరించే ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. జీహెచ్ఎంసీ మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల వెడల్పుతో రహదారి విస్తరణ జరుగుతున్నదన్నారు. అదేవిధంగా మెట్రో స్టేషన్లు నిర్మించే ప్రాంతాల్లో మాత్రం రోడ్డు 120 అడుగుల వెడల్పుతో విస్తరణ చేపట్టాల్సి ఉంటుందని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. దారుల్ షిపా జంక్షన్ నుంచి శాలిబండ వరకు ప్రస్తుతం రోడ్డు వెడల్పు 50 అడుగుల నుంచి 60 అడుగుల వరకు, శాలిబండ జంక్షన్ నుంచి చాంద్రాయణగుట్ట జంక్షన్ వరకు 80 అడుగులు ఉందన్నారు. అందువల్ల దారుల్‌షిపా-శాలిబండల మధ్య చాలా ఆస్తుల విషయంలో ఒక్కొక్కటీ 20-25 అడుగుల చొప్పున విస్తరణ చేయాల్సి ఉంటుందని, అలాగే శాలిబండ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఒక్కో ఆస్తిని 10 అడుగుల వరకు విస్తరణ చేయాల్సి ఉంటుందని వివరించారు. మెట్రో స్టేషన్లు, వంపులు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ఆస్తుల విషయంలో మాత్రం రహదారి విస్తరణ కాస్తా ఎక్కువగా ఉంటుందన్నారు.

### మెట్రో మార్గంలో సర్వే..

సాంప్రదాయంగా వస్తున్న సర్వే పద్ధతులతో పాటు 3డీలో వీక్షించే విధంగా లైడార్ డ్రైన్ సర్వే సైతం చేసినట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. దీనివల్ల ప్రభావితమయ్యే ఆస్తులతో పాటు చుట్టు పక్కల ఉన్న ఆస్తులను కూడా వీక్షించవచ్చన్నారు. ప్రభావిత నిర్మాణాల విలువను అంచనా వేసేందుకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ఇంజినీర్లు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. 7.5 కి.మీ మేర నిర్మించే మెట్రో కారిడార్‌లో 103 మతపరమైన, సున్నితమైన కట్టడాలు ఉన్నాయని, వాటి పరిరక్షణ విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. భూసేకరణ చట్టం అనుసరించి చేపడుతున్న ఈ భూసేకరణ కార్యక్రమం 8 నెలల్లో పూర్తి కావచ్చని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు.

### తిట్లు.. ట్వీట్లు..

మెట్రో కార్యకలాపాలపై ప్రయాణికుల గరం గరం

'సురక్షిత ప్రయాణం ఏందో ఏమో గానీ... జర్నీ మాత్రం కాస్ట్‌లీగా మారింది. రద్దీ అనుగుణంగా కోచ్‌లను పెంచరు. కానీ మెట్రో పార్కింగ్ పేరుతో భారీగా వసూళ్లకు తెగబడుతున్నారు. నిల్చుందామంటే స్థలం ఉండదు. మెట్రో రైలు ఎక్కే సమయంలోనూ తోసుకుంటూ ఎక్కాల్సి వస్తోంది..' అంటూ మెట్రో కార్యకలాపాలపై ప్రయాణికులు గరం గరం అవుతున్నారు. సోషల్ మీడియా వేదికగా మెట్రో సేవలపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఆగస్టు 25 నుంచి నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన పెయిడ్ పార్కింగ్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. హైదరాబాద్ మహానగరంలో రాకపోకలకు ఎంతో అనువుగా ఉంటుందని లక్షలాది మంది మెట్రోను ఆశ్రయిస్తున్నారు. తమ వాహనాలను మెట్రో స్టేషన్ల దగ్గర ఉచితంగా ఏర్పాటు చేసిన స్థలంలో పార్కింగ్ చేసి..నిత్యం మెట్రో రైళ్లలో రాకపోకలు సాగిస్తున్నారు. అలాంటి వారికి షాకింగ్ ఇస్తూ ఆగస్టు 25 నుంచి పార్కింగ్ ఫీజులను వసూలు చేస్తామంటూ ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు ఆగ్రహిస్తున్నారు. ఈనెల 14న మెట్రో స్టేషన్‌లో ఆందోళనకు దిగిన ప్రయాణికులు..మరోసారి ఈనెల 25న మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు సమాచారం.

# ఇంటర్ ఫీజు ₹3,520 మాత్రమే

## లక్షలు వసూలు చేస్తున్న ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు

**వివిధ రూపాల్లో.. రూ. కోట్లలో దోపిడీ**

అధిక ఫీజులతో విద్యార్థులు, తల్లిదండ్రుల ఇబ్బందులు

అయినా పట్టించుకోని సర్కారు

మహబూబియా కళాశాలలోని ఓ మూలకు 'ఇంటర్ బోర్డు'

ఫీజు దోపిడీ నియంత్రణకు **040-29700934, 9848781805**కు ఫిర్యాదు చేయొచ్చు

*అది పెద్ద పేరున్న ఓ కాలేజీ. అందులో ఫీజులు లక్షల్లో వసూళ్లు చేస్తున్నారు. గ్రూపుల వారీగా సెక్షన్లను ఏర్పాటు చేసి.. వాటికి వినసొంపైన పేర్లు పెట్టి ధరలు నిర్ణయించారు. ఇక వారు చెప్పిన ఫీజు చెల్లించాల్సిందే. లేదంటే విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవమాన భారం తప్పదు. ఇదేంటని ప్రశ్నిస్తే తమను ఎవ్వరూ ఏం చేయలేరని యాజమాన్యాలు బెదిరింపులకు దిగుతున్నాయి. అధికారులందరికీ సూట్‌కేసులు పంపిస్తామంటూ ఆ కళాశాల ప్రిన్సిపాల్, జీఎంలు చెప్పడం కొసమెరుపు.*





సిటీబ్యూరో, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్ విద్య పూర్తి చేయాలంటే రెండేండ్లకు ఫీజు ఎంతో తెలుసా? కేవలం రూ.3520 మాత్రమే. అదేంటని ఆశ్చర్యపోతున్నారా? ఇది నిజం. ఇంటర్ విద్య ట్యూషన్ ఫీజు ఏడాదికి కేవలం రూ. 1760 అని ప్రభుత్వమే నిర్ణయించిందని.. జిల్లా ఇంటర్ బోర్డు అధికారి తెలిపారు. కానీ ఈ ఆదేశాలు కేవలం పేపర్లకే పరిమితమయ్యాయి. క్షేత్రస్థాయిలో ఈ నిబంధనలు అమలు కావడం లేదు. ప్రతీ కాలేజీల్లో ఏడాదికి రూ.45 వేల నుంచి లక్ష యాభై వేల వరకు విద్యార్థుల నుంచి వసూళ్లు చేస్తున్నారు. ఇంటర్ పూర్తి చేయడానికి రెండేండ్లలో రూ.3-4 లక్షల వరకు ఖర్చు వస్తున్నదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత ఫీజులు వసూలు చేస్తున్నా.. అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. స్వయంగా ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోకుండా చేతులెత్తేస్తున్నారంటూ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇంటర్ కాలేజీల ఏర్పాటు పెద్ద మాఫియాను తలపిస్తున్నదని విద్యానిపుణులు చెబుతున్నారు.

### 275 ప్రైవేటు కాలేజీలు..

హైదరాబాద్‌లో మొత్తం 374 ఇంటర్ కాలేజీలు ఉంటే..ఇందులో 275 ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. ప్రతి కాలేజీలో 9 సెక్షన్ల ఏర్పాటుకు అనుమతి ఉంటుంది. ప్రతి సెక్షన్‌కు 88 మంది విద్యార్థులు ఉంటారు. ఈ లెక్కన మొదటి, ద్వితీయ సంవత్సరానికి మొత్తం విద్యార్థులు 1584 మంది వరకు ఉంటారు. ఈ నిబంధనల ప్రకారం ఇంటర్ కాలేజీ నడుచుకోవాలి. అయితే కొన్ని కాలేజీల్లో ఈ సంఖ్య మించిపోతున్నది. ఈ లెక్కన ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు ప్రకారం రూ. 52.80 లక్షలు ఉంటుంది. కానీ ప్రైవేటు కాలేజీలు వసూలు చేస్తున్న డబ్బు తెలిస్తే కండ్లు బైర్లు కమ్ముతాయి. సగటున ఒక విద్యార్థి నుంచి రెండేండ్లకు కనీసం లక్ష రూపాయలు వసూలు చేస్తున్నారనుకున్నా.. 1500 మంది విద్యార్థులకు ఫీజు 15 కోట్ల రూపాయలు అవుతుంది. ఇంత డబ్బు కేవలం ఒక్క కాలేజీ రెండేండ్లలో విద్యార్థుల నుంచి దోచుకుంటున్నది. ఇది కేవలం ఫీజు మాత్రమే.. అదనంగా ల్యాబ్, కంప్యూటర్ ఫీజులు, ఉన్నత చదువుల కోచింగ్ ఫీజులు అంటూ ఒక్కో విద్యార్థి నుంచి రూ.30 వేల నుంచి 50 వేల వరకు అదనంగా వసూళ్లు చేస్తున్నారు. ఇవి కూడా కలిపితే సుమారు మరో రూ. 5-7 కోట్లు అదనంగా దోచుకుంటున్నారు.

### ఇలా ఫిర్యాదు చేయండి..

హైదరాబాద్‌లో ప్రైవేటు కాలేజీల ఫీజు దోపిడీని నియంత్రించేందుకు, ఫీజుల ఒత్తిడితో నలిగిపోతున్న తల్లిదండ్రులు జిల్లా ఇంటర్ బోర్డు అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. కానీ ఆ కార్యాలయం ఎక్కడ ఉందో కూడా కనీసం తెలియని దుస్థితి. నాంపల్లిలోని మహబూబియా కాలేజీ కాంపౌండ్ లోపల ఓ మూలకు ఉంది. ఆ కార్యాలయం బోర్డు కనీసం ప్రధాన మార్గంలో ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. కార్యాలయం అడ్రస్ కోసం తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతున్నారు. కాగా, తల్లిదండ్రులు ఫీజుల దోపిడీపై 040-29700934, మొబైల్-9848781805 నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చు లేదా లేఖ రూపంలో అధికారుల దృష్టికి తీసుకురావొచ్చు.

### ఫిర్యాదు చేయండి.. చర్యలు తీసుకుంటాం

ప్రైవేటు కాలేజీల్లో అధిక ఫీజులు వసూలు చేయకూడదు. ప్రభుత్వం ఇప్పటి వరకు నిర్ణయించిన ఫీజు ఏడాదికి రూ.1760 మాత్రమే. కాలేజీలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందలేదు. మాకు ఫిర్యాదు వస్తే..ఆ కాలేజీలకు నోటీసులు జారీ చేస్తాం. వివరణ తీసుకుంటాం. ఉన్నతాధికారులకు ఆ కాలేజీపై చర్యల కోసం నివేదిక పంపిస్తాం. తదుపరి ఆదేశాలతో ఆ కాలేజీ సీజ్ చేస్తాం. అనుమతి లేకుండా అకాడమీల పేరుతో ఇంటర్ కాలేజీ పిల్లలకు కోచింగ్‌లు నిర్వహించకూడదు.

**- ఒడ్డెన్న, హైదరాబాద్ ఇంటర్ బోర్డు అధికారి**

### పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం

చైతన్య, నారాయణ వంటి కాలేజీల్లో జరుగుతున్న ఫీజు దోపిడీపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోవడం లేదు. ఫీజులు చెల్లించలేక చాలా మంది విద్యార్థులు, తల్లిదండ్రులు నలిగిపోతున్నారు. నిబంధనలు పాటించని కాలేజీలను సీజ్ చేయాలి. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

**-ప్రదీప్, అధ్యక్షుడు, ప్రగతిశీల యువజన సంఘం.**





# దారితప్పుతున్న మోడల్

## నీరుగారుతున్న లక్ష్యం..ఇతర అవసరాలకు మోడల్ మార్కెట్లు

సిటీబ్యూరో, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ప్రతి పది వేల మంది జనాభాకు ఒక ఆదర్శ మార్కెట్ ఉండాలన్న లక్ష్యం నీరుగారుతోంది. అందుబాటులోకి వచ్చిన మోడల్ మార్కెట్లను ఇతర అవసరాల పేరిట ప్రైవేట్‌పరం చేసే పనిలో ఉన్నారు. వాస్తవంగా అందుబాటులోకి వచ్చిన చోట స్థానికులకు సూపర్‌మార్కెట్లా ఈ మోడల్ మార్కెట్లు ఉపయోగపడాలి. కానీ మోడల్ భవనాలను ఏకంగా సీఎస్ఆర్ కింద ఫౌండేషన్లకు అప్పగిస్తున్నారు. తాజాగా, సీఎస్ఆర్ కింద డాక్టర్ విజయ్‌కుమార్ దాట్ల ఫౌండేషన్, బయోలాజికల్ ఈ లిమిటెడ్‌కు మోడల్ మార్కెట్ భవనాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఏడాది పాటు అప్పగించారు. స్కిల్లింగ్ అండ్ లివ్లీహుడ్ ప్రోగ్రాం కింద స్లమ్స్‌లోని పేద మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా ఆయా అంశాల్లో తగిన శిక్షణతో నైపుణ్యం కల్పించడంతో పాటు వారికి ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు లభించేలా, ఉపాధి పొందేలా సహకరిస్తామని సదరు ఫౌండేషన్ జీహెచ్ఎంసీకి తెలియజేసింది. ఈ మేరకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలుపగా, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌తో ఏడాది పాటు ఒప్పందం కుదుర్చుకున్నది. అయితే ముమ్ముందు ఇంకెన్ని మోడల్ మార్కెట్ భవనాలు ఇతర అవసరాలకు మళ్లిస్తారో చూడాల్సి ఉన్నది.

### పదివేల మందికి ఒక మార్కెట్..

గ్రేటర్‌లో ప్రతి పది వేల మందికి ఒక మోడల్ మార్కెట్ ఉండాలనే లక్ష్యంతో మోడల్ మార్కెట్ల నిర్మాణాలను బల్దియా చేపట్టింది.దాదాపు 40 మోడల్ మార్కెట్లు నిర్మించినా.. వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో విఫలమైంది. అంతేకాకుండా పురోగతిలో ఉన్న పనులను సైతం పట్టించుకోవడం లేదు. చిక్కడపల్లిలో రూ. 40 కోట్లు, అమీర్‌పేట రూ. 13.20 కోట్లు, పంజాగుట్టలో రూ.6.70 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా, ఎక్కడ వేసినా గొంగళి అక్కడే అన్న చందంగా పనులను పక్కన పెట్టారు. నారాయణగూడ ఓల్డ్ మున్సిపల్ వెజిటేబుల్ మార్కెట్ వద్ద రూ. 4 కోట్లతో చివర దశకు వచ్చిన పనులను సైతం పూర్తి చేయలేకపోతున్నారు. ఫలితంగా స్థానికులు వారాంతపు సంతలపై ఆధారపడాల్సి వస్తున్నది. కమిషనర్ స్పందించి మోడల్ మార్కెట్లపై సమీక్షించి.. పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రత్యేకతలతో మార్కెట్లు

ప్రశాంతమైన వాతావరణం, వెజిటేబుల్, నాన్‌వెజ్, స్టోర్ వేర్వేరుగా ఉంటున్నాయి. శాకాహార, మాంసాహార అమ్మక కేంద్రాలు, తినుబండారాల దుకాణాలు, ఫార్మసీ, ఏటీఎంలు, గ్రాసరీ దుకాణాలు, డ్రైఫ్రూట్ దుకాణాల ఏర్పాటు జీ+1 నిర్మాణంతో ఈ మోడల్ మార్కెట్లను నిర్మించారు.